

# చీకటి వెలుగు

సామాజిక రాజకీయ అధ్యాత్మిక సాయంకాలపు దిన పత్రిక


చీకటి వెలుగు దినపత్రిక
భాస్కర్ వాణి దిన పత్రిక
విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇంచార్జీలు, ఫొటోగ్రాఫర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు, డీటీపీ ఆపరేటర్లు కావలెను
ఎడిటర్ : కంది సూర్యనారాయణ
సెల్ : 9848052327



నల్లగొండ, హైద్రాబాద్ | సంపుటి : 17 | సంచిక :273 | ఎడిటర్ : కంది సూర్యనారాయణ | 03-02-2026 మంగళవారం | పేజీలు : 4 | వెల : రూ. 3


# బుజ్జగింపులో... ప్రధాన పార్టీలు

**బాబ్బాబు... మాట విను...**

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:**మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం ఉత్కంఠభరితంగా మారింది. ముందు ఇంటి పోరు గెలిచి, తర్వాత రచ్చ పోరు గెలవాల్సిన పరిస్థితి వచ్చింది. సొంత పార్టీ వారే లెక్కకు మించి నామినేషన్లు వేయడంతో, ప్రధాన పార్టీలకు వారిని బుజ్జగించడం సవాలుగా మారింది. దీన్ని పరిష్కరించేందుకు ఎక్కడికక్కడ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశారు.నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో పోటీకి దిగిన వారిని తమ దారిలోకి తెచ్చుకోవల్సిన అవసరం ఉంది. మరోవైపు టికెట్ దక్కక దిగులు పడుతున్న వారిని మచ్చిక చేసుకునేందుకు ప్రత్యర్థి పార్టీ ఎత్తులు వేస్తోంది. ఈ నెల 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు మొత్తం 29,694 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో కాంగ్రెస్ నుంచే 10,024 అంటే దాదాపు మూడో వంతు ఉన్నాయి.మొత్తం 2996 వార్డులకు ఎన్నికలు జరుగుతుండగా సగటున కాంగ్రెస్ నుంచి ఒక్కో వార్డుకు మూడుకు పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ తరఫున 7556 మంది, బీజేపీ నుంచి 5457 మంది నామినేషన్లు వేశారు. ఈ నేపథ్యంలో బరిలో రెబెల్ అభ్యర్థులు లేకుండా చూసేందుకు అన్ని పార్టీల నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సహజంగానే అధికార పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి పోటీ అభ్యర్థులు అధికంగా ఉన్నారు. అత్యధికంగా



మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు 328 మంది కాంగ్రెస్ అభ్యర్థులు పోటీకి దిగారు. వీరిలో 268 మందిని ఉపసంహరించుకునేలా చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ప్రాతినిధ్యం వహించి ఉండటం, మహబూబ్‌నగర్ పట్టణంతో ఆయనకు మంచి అనుబంధం ఉండటంతో స్థానిక నాయకులు తమ ఉనికి చాటుకునేందుకే పోటీకి దిగారని తెలుస్తోంది.: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సొంత జిల్లా అయిన నిజామాబాద్ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు కాంగ్రెస్ నుంచి 319 మంది రంగంలోకి దిగారు. ఇక్కడ కూడా ఉపసంహరణలు సవాలుగా మారే పరిస్థితి ఉంది. ఇక్కడ ఛైర్మన్ ఎన్నికలో మజ్లిస్‌దే కీలకపాత్ర. ఉదాహరణకు గత ఎన్నికల్లో బీజేపీ 28 స్థానాలు గెలిచినా ఛైర్మన్ పదవి దక్కించుకోలేకపోయింది. కేవలం 13 స్థానాలు మాత్రమే పొందిన బీఆర్ఎస్, 15 స్థానాలు వచ్చిన మజ్లిస్‌తో కలిసి కార్పొరేషన్‌ను చేజిక్కించుకుంది.మజ్లిస్ అండతో : ఇప్పుడు మజ్లిస్ పార్టీ కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండటంతో నిజామాబాద్ కార్పొరేషన్ దక్కించుకోవచ్చన్న ఆశావహ పరిస్థితులే ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేయడానికి కారణంగా భావిస్తున్నారు. బీజేపీ నుంచి కూడా ఇక్కడ 252 మంది నామినేషన్లు దాఖలు చేశారు. గత ఎన్నికల్లో అత్యధిక స్థానాలు -

మిగతా3లో

# ఓట్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు



**టీ బీజేపీ చీఫ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 02:** రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా -

మిగతా3లో

# రిజిస్ట్రేషన్లతో... భారీగా ఆదాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:**తెలంగాణలో భూముల ధరలు భారీగా పెరిగాయి. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఒక్క డిసెంబర్ నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.1,391.30 కోట్ల ఆదాయం వచ్చి చేరినట్లు అధికారులు వెల్లడించారు.తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం మరోసారి పుంజుకుంటోంది. హైదరాబాద్ పట్టణంతో పాటు శివారు ప్రాంతాలు, జిల్లాల్లోనూ ఇళ్ల స్థలాలు, ఫ్లాట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క డిసెంబరు నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.1,391.30 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటివరకు నమోదైన



రాబడిలో మే నెలలో వచ్చిన రూ.1,390 కోట్లు అధికం. తాజాగా డిసెంబరులో ఆ రికార్డును అధిగమించింది. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక రికార్డులను కూడా అధిగమించి అత్యధిక రాబడిని నమోదు చేసింది.ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికే రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో అత్యధిక రాబడి 2022-23లో రూ.11,806.34 కోట్లు కాగా.. ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో -

మిగతా3లో

# సౌత్ కు బూస్టప్... కారిడార్లు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:**హైదరాబాద్ నుంచి అత్యాధునిక, అత్యంత వేగవంతమైన బుల్లెట్ ట్రైన్లు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏడు హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టుల్ని మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026-27లో ప్రకటించింది. ఈ హైస్పీడ్ ట్రైన్ నెట్‌వర్క్‌లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్ర బిందువుగా మారనుంది. నగరం నుంచి పుణె, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు హైస్పీడ్ ట్రైన్లు నడవనున్నాయి.హైదరాబాద్ నుంచి పుణె, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లేవారికి గుడ్‌న్యూస్. త్వర్వలోనే ఈ నగరాలకు హైస్పీడ్‌గా చేరుకోనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌లో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రకటించగా.. అందులో మూడు హైదరాబాద్ నుంచే ఉన్నాయి. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణె నగరాలకు ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే.. తెలుగు




రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల మధ్య కూడా రాకపోకలు వేగవంతమవుతాయి.ప్రస్తుతం -

మిగతా3లో

# వెనిజులాతో ఆయిల్ ఒప్పందం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:**పంచంలో చమురు దిగుమతుల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. చైనా తర్వాత ఎక్కువ మార్కెట్ ఉన్న దేశం భారతే. అందుకే పెట్రోలియం ఉత్పత్తి దేశాలు భారత్‌కు ఎగుమతి చేయడానికి చూస్తుంటాయి. భారత్ కూడా ఒకే దేశంపై ఆధారపడకుండా వివిధ దేశాలతో అగ్రిమెంట్ చేసుకుంది. ప్రస్తుతం రష్యా నుంచి ఎక్కువ మొత్తంలో చమురు దిగుమతి చేసుకుని యురోపియన్ యూనియన్, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తోంది. ఫలితంగా భారత్ లాభపడుతోంది. అయితే రష్యానుంచి భారత్ చమురు దిగుమతికి చెక్ పెట్టేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చమురు దిగుమతిని సాకుగా చూపి 25 శాతం సుంకాలు విధించారు. తాజాగా వెనెజువెలా చమురు డీల్‌లో -

మిగతా3లో

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి

# తీవ్ర అన్యాయం...

**రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు శూన్యమని విమర్శ**

**రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు శూన్యమని విమర్శ**

**ఫార్మా, ఎలక్ట్రానిక్స్, టూరిజం వంటి కీలక రంగాల్లోనూ మొండిచెయ్యి**

**రాష్ట్ర విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదని భట్టి విక్రమార్క ఆవేదన**

**నిధుల కోసం ఎంపీలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపు**



**హైదరాబాద్:**కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశించిన కేటాయింపులు ఏవీ దక్కలేదని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీలు పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రిని కలిసి రాష్ట్ర ప్రయోజనాల కోసం విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని భట్టి మీడియాకు తెలిపారు. మూసీ నది ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ నగర అభివృద్ధి, మెట్రో రైల్ విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులకు నిధులు వస్తాయని ఆశించామని, కానీ కేంద్రం మొండిచెయ్యి చూపిందని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ ఫార్మా -

మిగతా3లో



# కేసీఆర్ భావోద్వేగం..

**అప్పుడు అస్థిత్వం... ఇప్పుడు విచారణలా.**

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:**తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. గత పదేళ్లు రాష్ట్రాన్ని శాసించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నందినగర్ నివాసంలో సిట్ అధికారుల విచారణను దుర్కొన్నారు. కేవలం విచారణే కాదు, అక్కడ చోటుచేసుకున్న పరిణామాలు, కేసీఆర్ వ్యక్తం చేసిన భావోద్వేగాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.విచారణ ప్రారంభానికి ముందు కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు తెలుస్తోంది. మధ్యాహ్న భోజన సమయంలో తన సన్నిహితుల వద్ద ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం తెలంగాణ ఉద్యమ కాలంలో కీలక నిర్ణయాలకు వేదిక. "స్వరాష్ట్ర సాధన కోసం ఇదే గదిలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. వ్యూహాలు రచించాను. అలాంటి

## సంపాదకీయం

# విబి జి రామ్ జితో భారత్ వికసించేనా?

ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాటి పాలకుల విధానాలను, సంక్షేమ పథకాలను, వాటి పేర్లను మార్చడం పాలకుల రాజకీయ ఎత్తుగడలో భాగం, సహజం కూడా. అయితే మార్పు అనేది పాలకుల సర్వతోముఖాభివృద్ధికి కాకుండా ప్రజలకు కనీస జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ఉండాలి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పాలకులు రూపొందించిన అభివృద్ధి విధానాలను, సంక్షేమ పథకాలను లోప భూయిష్టమైనవిగా పేర్కొంటూ వాటిని ఆపివేయడం సర్వసాధారణమైన ప్రక్రియగా మారింది. గత ప్రభుత్వాలు ప్రారంభించి, పూర్తి కాని అభివృద్ధి పథకాల (నీటిపారుదల ప్రాజెక్టులు, విద్య, వైద్య తదితర రంగాల పనుల)ను యథాతథంగా కొనసాగిస్తే ఆ పేరుప్రతిష్ఠలు గత ప్రభుత్వానికి దక్కుతాయేమోననే అక్కసుతోనే నిలుపుదల చేయడం మూలంగా లక్షలాది కోట్ల ప్రజాధనం వృథా అవుతుంది. 2005 లో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం గ్రామాల నుండి పట్టణాలకి వలసలని నివారించడం, పేదరికాన్ని తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (కరువు పని, 100 రోజుల పని) చట్టం 2005ను ప్రముఖ ఆర్థికవేత్తలు, మేధావులు, పార్లమెంటు సభ్యులు, వివిధ కమిటీలతో అనేక మార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఎంజిఎన్ఎఆర్ఇజిఎ చట్టరూపం దాల్చి రెండు దశాబ్దాలుగా (కొన్ని లోపాలు ఉన్నప్పటికీ) నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు ముందుకు వేస్తున్నది. ఈ పథకం చట్ట రూపంలో ఉన్న కారణంగా ఉపాధి కూలీలకు అన్యాయం జరిగితే చట్టపరంగా న్యాయాన్ని పొందే అవకాశం, ఉపాధి (పని)ని హక్కుగా డిమాండ్ చేసే అవకాశం ఉండడం ఉపాధి కూలీలకు ప్రధాన బలాలైతే ప్రభుత్వం ఈ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి చట్టం రూపంలో హామీ పడి ఉంది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 2025 లో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి జి రామ్ జి) మిషన్‌ను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలలో భాగంగా తీసుకొచ్చామని చెబుతూనే గత ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలున్న కారణంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎంజిఎన్ఎఆర్ఇజిఎ 2005 చట్టం తూచా తప్పకుండా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఉపాధి హామీని నిరాటంకంగా కొనసాగించాలి అని చెబుతోంది. కానీ విబి జి రామ్ జి 2025 మిషన్ అనేది ప్రభుత్వ ఇచ్ఛ ఉన్నంత వరకే కొనసాగుతుంది. వీటి మధ్యనున్న ఈ వ్యత్యాసాన్ని గమనించకపోతే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ అనేది 'హక్కు'గా ఉండకుండా పోయే ప్రమాదముంది. నూతన పథకంలో '25 రోజుల పని దినాలను అదనంగా పెంచడం' జియో టాగింగ్ ఆధారంగా వేతనాల చెల్లింపులు తప్ప విబి జి రామ్ జి 2025 లక్ష్యాల్లో చెప్పుకోదగ్గ మార్పులేవీ లేవు. నూతన ఉపాధి పథకానికి కేటాయించే బడ్జెట్‌లో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 10% వాటాను భరించాల్సి ఉంటుంది. గత ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో కూలీలు, సిబ్బంది వేతనాలకు 100%, సామాగ్రి కొనుగోళ్లకు వాటా 90%, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా 10శాతం వాటాలు మాత్రమే భరించాయి. ప్రస్తుతం దేశంలోని చాలా రాష్ట్రాలు ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించలేని పరిస్థితి ఉన్నది. దానికి తోడు నూతన ఉపాధి పథకంలో రాష్ట్రాల నెత్తిన మోపిన భారం కారణంగా ఒకవేళ ఆయా రాష్ట్రాలు ఆసక్తి చూపకపోయినా, రాష్ట్రాల్లో తమకు అనుకూలమైన ప్రభుత్వాలు లేకపోయినా సదరు రాష్ట్రాలు వాటా ఇవ్వలేదనే నెపంతో ఆయా రాష్ట్రాలపై వ్యతిరేకతను కూడగట్టి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చే విధంగా కుట్రలు చేయడం వలన పథకం లక్ష్యాలు నెరవేరకుండా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. నూతన పథకంలో రెండవ ప్రధానమైన అంశం వర్షాకాలంలో వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడుతుందనే కారణంతో 60 రోజుల పాటు ఉపాధి పథకాన్ని నిలిపివేయడం. దీని కారణంగా వ్యవసాయ కూలీల డిమాండ్ తగ్గి తక్కువ వేతనానికే పనికి వెళ్లాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు పోలేనటువంటి వారి జీవనోపాధి దెబ్బ తింటుంది. ఎనభై శాతం యాంత్రీకరణ జరిగిన వ్యవసాయ రంగంలో రెండు నెలల పాటు ఉపాధి పనులు నిలిపివేయడం ఉపాధి నిరోధక చర్యే అవుతుంది. నూతన ఉపాధి పథకంలో కేంద్ర నిర్ణయమే శిరోధార్యంగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ అదే జరిగితే నూతన ఉపాధి పథకం ఏ రాష్ట్రంలో జరగాలి, ఎటువంటి పనులు చేయాలనేది కేంద్రం ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. అప్పుడు రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గడమే కాక వికేంద్రీకరణ ఆదర్శం దెబ్బతిని రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయించే ప్రమాదముంది. బాధ్యత, జవాబుదారీతనం పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపడం వలన ఉపాధి హామీ అసలు లక్ష్యం నెరవేరకుండా క్రమంగా పథకం ఉనికిని కోల్పోయే ప్రమాదముంది. ఏ పథకమైనా విజయవంతం కావాలంటే పాలకుల్లో దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణ, అధికారుల్లో చిత్తశుద్ధి ఉండాలి. అప్పుడే ఉపాధి పథక లక్ష్యాలైన స్థానిక సంస్థలు బలపడడం, ఉత్పాదక ఆస్తుల సృష్టి, ఆర్థిక అసమానతల తగ్గుదల, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ కొంత మేరకైనా సఫలీకృతమై సామాజిక, ఆర్థిక అంతరాల గోడల్ని బద్దలు కొట్టగలం. పాలకులు కూడా దేశాన్ని పట్టిపీడిస్తున్న పేదరికం, నిరుద్యోగం, డ్రగ్స్, ఉగ్రవాదం, అవినీతిలను ప్రధాన శత్రువులుగా భావించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది.

# భారీగా పెరిగి... తర్వాత తగ్గి...

**ముంబై, ఫిబ్రవరి 2:**ఏడాదిగా భారీగా పెరుగుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు రెండు రోజులుగా రికార్డు స్థాయిలో పతనం అవుతున్నాయి. 2025 ప్రారంభంలో 10 గ్రాముల బంగారం రూ.లక్ష లోపు ఉండగా, ఇప్పుడు రూ.1.50 లక్షలు దాటింది. ఈ జనవరిలో 26 శాతం పెరిగింది. ఇక వెండి ధర గత జనవరిలో కిలో రూ.70 వేలు ఉండగా ఈ జనవరిలో 56 శాతం పెరిగి రూ.3.50 లక్షలకు చేరింది. అయితే సడెన్‌గా ధరల పతనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.2025లో భారత్‌లో ఈ లోహాలు గణనీయ రైజ్ చూపాయి. గరిష్ట స్థాయికి చేరిన తర్వాత కొనుగోళ్లు ఆగిపోయాయి. పెట్టుబడిదారులు దూరమయ్యారు. ఇప్పటికే కొన్నవారు లాభాలు లాక్ చేసుకోవడానికి అమ్మకాలు మొదలుపెట్టారు. డాలర్ విలువ 0.4% పెరగడం ఈ ట్రెండ్‌ను మరింత ఊర్చిందిధరల పతనానికి మూల కారణం అమెరికాలో రాజకీయ టెన్షన్స్. ట్రంప్, ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మధ్య దీర్ఘకాల విభేదాలు తీవ్రమయ్యాయి. ట్రంప్ వడ్డీ రేట్లు తగ్గించమని ఒత్తిడి తెచ్చాడు, కానీ పావెల్ స్వతంత్రంగా పని చేయాలని నిరసిస్తున్నారు. పావెల్ తనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్‌కు ఆదేశించారని, డాలర్ బలోపేత చర్యలు చేపట్టానని ప్రకటించారు. ట్రంప్ పావెల్‌ను నియమించినా, మేలో పదవి ముగియనుంది. కానీ, ట్రంప్ ఆరు నెలల ముందే పావెల్ వారసుడుగా కెవిన్ వార్స్‌ను ప్రకటించడం గందరగోళాన్ని మేల్కొల్పింది.ట్రంప్ విధానాల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లు క్రాష్ అయ్యాయి. ఈ అస్థిరత ప్రపంచ పెట్టుబడిదారులను భయపెట్టింది. బంగారం, వెండి వంటి సేఫ్ హేవెన్ ఆస్తులు కూడా అమ్మకాలకు గురయ్యాయి. భారత్‌లో డిమాండ్ తగ్గడంతో ధరలు మరింత పడిపోయాయి.బంగారం, వెండి ధరల పతనం అవకాశాలను అందిస్తోంది -- తక్కువ ధరల్లో కొనుగోలు చేయవచ్చు. కానీ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ మార్పులు, ఫెడ్ పాలసీలు దృష్టిలో ఉంచుకోవాలి. షార్ట్--టర్మ్ వోలటాలిటీ ఉంటుంది, లాంగ్--టర్మ్ ఇన్వెస్టర్లు ఓపిక పాటించాలి.

# కింగ్ మేకర్ గా విజయ్...

**చెన్నై, ఫిబ్రవరి 2:**తమిళనాడులో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలతోపాటు బీజేపీ కూడా తమిళనాడులో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాయి. ఈమేరకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. ఇక ఈసారి ఎన్నికల్లో సినీ స్టార్ విజయ్ పార్టీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే చివరి సినిమా విడుదల విషయంలో ఇబ్బందులు పడుతుండగా, తాజాగా వచ్చిన సర్వే ఫలితాలు విజయ్ పార్టీకి పెద్ద ఊరటనిచ్చాయి. ఇండియా టుడే, సీ ఓటర్ సర్వే ఫలితాలు వెల్లడయ్యాయి.తాజా సర్వేలో ఇండీ కూటమి 45% ఓటర్ల మద్దతు సాధించగా, ఎన్డీఏకు 33% లభించింది. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన టీవీకే 15% ఓటర్లను ఆకర్షించింది. మిగిలిన 7% ఇతర పార్టీలకు విభజించబడింది. ఈ శాతం టీవీకేను గణనీయ శక్తిగా నిలబెట్టింది.విజయ్ మాస్ అప్పీల్, క్లీన్ ఇమేజ్ వల్ల పార్టీ పాపులారిటీ పెరిగింది. పట్టణ, యువత ప్రాంతాల్లో టీవీకే బలం కనిపిస్తోంది. ఇది సంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా యువత ఎంపిక చేసుకుంటున్నట్టు సూచిస్తోందితాజా సర్వే ఫలితాలు టీవీకే క్యాడర్‌కు ఎనర్జీ ఇస్తాయి. ప్రస్తుత ట్రెండ్ కొనసాగితే, కూటములు, ప్రభుత్వ ఏర్పాటులో టీవీకే కీలక పాత్ర పోషిస్తుంది. రాజకీయ విశ్లేషకులు టీవీకేను అతీతంగా చూస్తున్నారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త ఆకాంక్షకు టీవీకే సిద్ధమవుతోంది.

# విమాన ప్రమాదాలకు అంతం ఎప్పుడు



ఆది అంతమూ లేని ఆకాశాన్ని.. అసలైన స్వేచ్ఛకు ప్రతీకగా మనం భావిస్తూ ఉంటాం. అయితే.. సమున్నతంగా, అనంతంగా వ్యాపించిన ఆ నీలి ఆకాశమే.. జాతిని ముందుకు నడపాల్సిన విలువైన వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా చిదిమేసినప్పుడు కలిగే దుఃఖం మాటల్లో చెప్పలేనిది. తనను నమ్ముకున్న అనుచరులు పోటీ చేస్తున్న చోట ప్రచారానికో, దగాపడిన ప్రజలకు ధైర్యం చెబుదామనో, దేశప్రగతిని పట్టాలెక్కించే మరో కార్యక్రమం కోసమో.. విమానంలోనో, హెలికాప్టర్‌లోనో బయలుదేరిన నేతలు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయినప్పుడు.. అది చెప్పలేని విషాదంగా పరిణమిస్తుంది. దేశ గమనాన్ని మార్చి, కోట్లాది జాతిజనుల కలలకు ప్రతీకలుగా నిలిచిన ఆ వ్యక్తులు ఈ ప్రపంచం నుంచి మాయమైన తీరు.. ఒక తరానికి పీడకలగానే నిలిచిపోతుంది. భారతప్రజాస్వామ్య చరిత్రలో అలాంటి అత్యంత విషాదకరమైన పీడకలలు ఎన్నో ఉన్నాయి. అశేష ప్రజానీకానికి ఆరాధ్య దైవాలుగా నిలిచిన ఆ నేతల చివరి ప్రయాణాలను తలచుకుంటే.. నేటికీ గుండె బరువెక్కక మానదు. ఈ జాబితాలో ప్రజల మనసులు గెలిచిన నాయకుల నుంచి అన్ని రంగాల ప్రముఖులూ ఉన్నారు. విమాన ప్రమాదాలు అనగానే తెలుగువారికి ముందుగా కొన్ని పేర్లు గుర్తుకు వస్తాయి. వారిలో యలవర్తి నాయుడమ్మ ఒకరు. చిన్న రైతు కుటుంబంలో పుట్టిన నాయుడమ్మ అంతర్జాతీయ స్థాయి రసాయన శాస్త్రవేత్తగా ఎదిగారు.అప్పట్లో ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీకి సలహాదారుగా పనిచేసిన ఆయన, ఐక్యరాజ్యసమితితోపాటు పలు అంతర్జాతీయ సంస్థలకు, విదేశీ సంస్థలకు కూడా సలహాదారుగా పనిచేశారు. కెనడాలోని ఐడిఆర్‌సి సమావేశానికి హాజరై 1985 జూన్ 23న తిరిగి వస్తున్న క్రమంలో ఆ ఎయిర్ ఇండియా పేలిపోవటంతో కన్నుమూశారు. ఈ వార్త వినగానే.. ఆయన భార్య డాక్టర్ పవన ఆత్మహత్య చేసుకుని మరణించటం మరో విషాదం. ఇలాంటి విషాద వార్తలు వినగానే తెలుగువారికి ఏపి మాజీ సిఎం రాజశేఖరరెడ్డి, నాటి లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి, సినీ నటి సౌందర్య మరణాలు గుర్తుకు రాకుండా ఉండవు. లోక్‌సభ మాజీ స్పీకర్, టిడిపి నేత జిఎంసి బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. భీమవరం నుంచి బయలుదేరిన ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేట్ హెలికాప్టర్, కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని ఓ చెరువులో కూలిపోయింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత తెలుగువారికి ఎంతో సుపరిచితురాలైన ప్రముఖ సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఇక.. తెలుగు రాష్ట్రాల ప్రజల జనహృదయ నేతగా పేరు తెచ్చుకున్న నేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 14 వ సిఎంగా పనిచేసిన వైఎస్ఆర్.. 2009, సెప్టెంబర్ 2న నల్లమల అడవుల్లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్రంగా కలచివేసింది. విమాన ప్రమాదంలో దేశం కోల్పోయిన మరో మేధావి హోమీ జహంగీర్ బాబా. 1966 జనవరి 24న జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఈ ప్రపంచ ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త అకాల మరణం చెందారు. 1980 జూన్ 23న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన విమానాన్ని నడుపుతూ, ప్రమాదకర విన్యాసాలు చేయడానికి ప్రయత్నించగా, విమానం కూలిపోయింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి మాధవరావు సింధియా 2001 సెప్టెంబర్ 30న విమాన ప్రమాదంలో మృతి చెందారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా, ఆయన ప్రయాణిస్తున్న విమానం ఉత్తరప్రదేశ్ మైన్‌పురి సమీపంలో కూలిపోయింది. అలాగే, ప్రముఖ పారిశ్రామికవేత్త, హర్యానా మంత్రి ఓంప్రకాశ్ జిందాల్ 2005 మార్చి 31న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. 2011 ఏప్రిల్ 30న తవాంగ్, ఇటానగర్ మధ్య జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అప్పటి అరుణాచల్‌ప్రదేశ్ సిఎం దోర్జి ఖండు దుర్మరణం చెందారు.భారతదేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ 2021 డిసెంబర్ 8న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రమాదంలో బిపిన్ రావత్ భార్యతోపాటు మరో 11మంది మరణించారు. నిరుడు జూన్ నెలలో దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మరణించారు. ఇలా వరుసగా జరుగుతున్న విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు చరిత్రలో చెరగని విషాద ఘట్టాలుగా నిలిచిపోయాయి. తాజాగా, బుధవారం ఉదయం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు మృతి చెందారు. ఈ వార్త విని యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైంది. ముంబై నుంచి తన సొంత నియోజకవర్గం బారామతిలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం బయల్దేరినప్పటి నుంచి రెండుసార్లు సిగ్నల్స్ కట్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటాలో తేలింది. ఉదయం 8:10 గంటలకు ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన విమానం, ప్రారంభంలో 6 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించింది. 8:34 నిమిషాలకు మొదటిసారి సిగ్నల్స్ ఆగిపోయి, కొద్దిసేపటి తర్వాత మళ్లీ కనెక్ట్ అయ్యాయి. అయితే, 8:43 నిమిషాలకు బారామతి ఎయిర్‌పోర్ట్‌కు కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడు సిగ్నల్స్ పూర్తిగా నిలిచిపోయాయి. ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందు విమానం వేగం గంటకు 237 కిలోమీటర్లకు పడిపోయి, ఆకస్మికంగా సంబంధాలు తెగిపోవడంతో కూలిపోయినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. విమాన ప్రమాదాలకు చాలా సార్లు పైలట్ తప్పిదం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో నిర్లక్ష్యం కారణంగా కూలిపోయిన ఘటనలు గతంలో వెలుగుచూశాం. అంతేకాకుండా చాలాసార్లు విమానాలు నడిపే పైలట్లకు అనుభవం లేకపోవడం వల్ల.. వారు తీసుకునే తప్పుడు నిర్ణయాలతోనూ విమానాలు కూలిపోయే అవకాశాలుంటాయి. ఇక సాంకేతిక సిబ్బంది చేసిన తప్పుల కారణంగా సైతం విమానాలు కూలిపోతుంటాయి. పైలట్ - కంట్రోల్ రూమ్ మధ్య కమ్యూనికేషన్ కోల్పోవడం కూడా విమాన ప్రమాదానికి దారితీస్తుంది. వాతావరణం కూడా విమాన ప్రమాదాలకు కారణం అవుతుంది. బలమైన తుఫానులు, మెరుపులు, భారీ వర్షం, వాతావరణంలో అల్లకల్లోలం కారణంగా, విమానం నియంత్రణ కోల్పోయి ప్రమాదం బారినపడే అవకాశాలుంటాయని నిపుణులు అంటున్నారు.

# పొరుగుదేశాలకు నిధులు...



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:**కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026లో వివిధ దేశాలకు సహాయం చేసేందుకు నిధులు కేటాయించింది. ఆయా దేశాలకు మొత్తంగా నిధుల కేటాయింపు ఈసారి పెరిగినా.. ఆర్థిక ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని టైట్‌గా కేటాయింపులు చేసింది కేంద్రం. అధిక సాయం పొందిన దేశాల్లో ఈసారి కూడా భూటాన్ టాప్‌లో నిలిచింది. ఈ పొరుగు దేశానికి ఈసారి బడ్జెట్‌లో రూ. 2,289 కోట్లు దక్కాయి. ఆ తర్వాత నేపాల్ రూ.800 కోట్లు దక్కించుకుంది. ప్రతి ఏటా బడ్జెట్‌లో మిత్ర దేశాలు, పొరుగు దేశాలకు ఆర్థిక సహాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్ని కేటాయింపులు చేస్తుంది. 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానంలో భాగంగా కేంద్రం ఈ నిధులను కేటాయిస్తోంది. ఈ క్రమంలోనే 2026 బడ్జెట్‌లో విదేశీ వ్యవహారాల శాఖకు మొత్తంగా రూ. 22,119 కోట్లు కేటాయించింది. అందులో వివిధ దేశాలకు సహాయం చేసేందుకు రూ. 5,686 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, గతేడాదితో (రూ. 5,483 కోట్లు) పోలిస్తే ఈసారి 4 శాతం నిధులు పెరిగాయి. అయితే ఈ బడ్జెట్‌లో ఆర్థిక సహాయం పొందిన లిస్టులో భారత్ పొరుగు దేశమైన భూటాన్ తొలి స్థానంలో నిలిచింది. ఇక బంగ్లాదేశ్‌తో సంబంధాలకు బీటలు వారుతున్నా.. ఆ దేశానికి కూడా కేటాయింపులు చేయడం విశేషం.భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రదేశం అయిన భూటాన్‌కు.. సాయంలో కేంద్రం అధిక నిధులు కేటాయించింది. 2026-2027 సంవత్సరానికిగానూ భూటాన్‌కు రూ. 2,289 కోట్లు కేటాయించింది. అయితే గతేడాది భూటాన్‌కు రూ. 2,150 కోట్లు ఇవ్వగా.. ఈసారి 6 శాతం నిధులు ఎక్కువగా కేటాయించారు. భూటాన్‌లో మౌలిక సదుపాయాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, ఆర్థిక సహకారానికి భారత్ ఈ నిధులు కేటాయిస్తోంది.కాగా, నేపాల్, శ్రీలంకకు కూడా నిధులు కేటాయింపులు పెరిగాయి. నేపాల్‌కు గతేడాది కంటే 14 శాతం పెంపుతో రూ. 800 కోట్లు ఇచ్చింది. శ్రీలంకు రూ. 400 కోట్లు ఇచ్చింది. మారిషస్‌కు 10 శాతం పెంపుతో రూ. 550 కోట్లు కేటాయించింది. కాగా, మల్దీవులుకు గతేడాది కంటే 8 శాతం నిధులు తగ్గాయి. ఈ ద్వీప దేశానికి కేంద్రం రూ.550 కోట్లు కేటాయించింది. మరో పొరుగు దేశం అఫ్ఘానిస్తాన్‌కు నిధుల కేటాయింపుల్లో తేడాలేదు. గతేడాది లాగే ఈసారి కూడా రూ. 150 కోట్లు ఇచ్చింది భారత ప్రభుత్వం. మయన్మార్‌కు 10 శాతం పెంచి రూ. 300 కోట్ల నిధులు కేటాయించింది.ఇవే కాకుండా ఆఫ్రికా ఖండంలోని పలు దేశాలకు మొత్తంగా రూ.225 కోట్లు, లాటిన్ అమెరికా దేశాలకు రూ.120 కోట్లు, యూరేసియన్ దేశాలకు రూ.38 కోట్లు కేటాయింపులు చేసింది కేంద్ర ప్రభుత్వం.

వివిధ దేశాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధుల వివరాలు :

భూటాన్ - రూ. 2288.55 కోట్లు
నేపాల్ - రూ. 800 (గతేడాది కంటే రూ. 100 కోట్లు అదనం)
మాల్దీవులు - రూ. 550 (రూ. 50 కోట్లు తగ్గుదల)
మారిషస్ - రూ. 550 (రూ. 50 అదనం)
శ్రీలంక - రూ. 400 (రూ. 100 కోట్లు అదనం)
మయన్మార్ - రూ. 300 కోట్లు (రూ. 50 కోట్లు తగ్గుదల)
ఆఫ్ఘనిస్తాన్ - రూ. 150 కోట్లు (రూ. 50 కోట్లు అదనం)
బంగ్లాదేశ్ - రూ. 60 కోట్లు ( రూ. 60 కోట్లు తగ్గుదల)
మంగోలియా - రూ. 25 (రూ. 20 కోట్లు అదనం)
సీషెల్స్ - రూ. 19 కోట్లు

# ఓట్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు...

- మొదటి పేజీ తరువాయి

ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా



పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

# బుజ్జగింపులో... ప్రధాన పార్టీలు

- మొదటి పేజీ తరువాయి

దక్కించుకుంది.గెలుపు కోసం తీవ్ర శ్రమ : 66 డివిజన్లు ఉన్న కరీంనగర్ కార్పొరేషన్లో కాంగ్రెస్ తరఫున 308 మంది నామినేషన్లు వేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి తీవ్రంగా పోటీ ఉన్నా కార్పొరేషన్‌ను దక్కించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కాంగ్రెస్ పార్టీ, అభ్యర్థుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. బీఆర్ఎస్ నుంచి కూడా అత్యధికంగా 257 మంది నామినేషన్లు వేశారు.ఒకే కుటుంబం నుంచి ముగ్గురు : మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇంకో రకమైన పరిస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుటుంబం నుంచి ఆయన ఇద్దరు కుమారులు, భార్య నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశంగా మారింది. తన ప్రమేయం లేకుండానే కొందరు నాయకులు అభ్యర్థులను ప్రకటిస్తున్నారన్న ఆగ్రహంతోనే లక్ష్మారెడ్డి ముగ్గురితో నామినేషన్లు వేయించారని తెలుస్తోంది. ఎమ్మెల్యేను బుజ్జగించేందుకు పార్టీ రాష్ట్ర నాయకులు ప్రయత్నిస్తున్నారు.నామినేషన్ వేయని అభ్యర్థులు : నల్గొండ కార్పొరేషన్లో విచిత్రమైన పరిస్థితి నెలకొంది.

# కేసీఆర్ భావోద్వేగం..

- మొదటి పేజీ తరువాయి

పవిత్రమైన చోట నేడు నేరారోపణలపై విచారణ ఎదుర్కోవాల్సి రావడం బాధాకరం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "తెలంగాణ అస్థిత్వం కోసం పోరాడిన గదిలో.. ఇప్పుడు అదే రాష్ట్రంలో విచారణ ఎదుర్కోవడం కాలం చేసిన వింత క్రీడ." అని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయ పడుతున్నారు.ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ విచారణలో సిట్ అధికారులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు సమాచారం. సాధారణంగా విచారణ సమయంలో న్యాయవాదులను అనుమతించాలని కోరుతుంటారు, కానీ సిట్ అధికారులు ఇందుకు నిరాకరించారు. నిబంధనల ప్రకారం కేవలం కేసీఆర్‌ను మాత్రమే ప్రశ్నించారు. విచారణ మొదలవ్వగానే మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు ఇతర కీలక నేతలను అధికారులు బయటకు పంపేశారు. లోపల కేసీఆర్, సిట్ బృందం మాత్రమే ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక అధికారుల వాంగ్మూలాలు, రికార్డైన ఆధారాల ప్రాతిపదికన కేసీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది.కేసీఆర్ విచారణ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నందినగర్ నివాసం చుట్టూ భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. తమ నాయకుడిని విచారించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు అక్కడక్కడా నిరసనలకు దిగుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా కనిపిస్తోంది. కేసీఆర్ భావోద్వంతో కేడర్ లో సెంటిమెంట్ పెరిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతోందని సమర్థించుకుంటోంది. అయితే బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ దుమారం ఏ స్థాయిలో రచ్చకు కారణమయ్యాయో తెలుసు. కానీ ఉద్యమనేత కేసీఆర్ నే విచారించడాన్ని మాత్రం బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. తెలంగాణ సాధించిన నేతగా, దశాబ్ద కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి విచారణ ఎదుర్కోవాల్సి రావడం విశేషమే.!



# రిజిస్ట్రేషన్లతో భారీగా ఆదాయం

- మొదటి పేజీ తరువాయి

జనవరి 15 నాటికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 13.42 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారులు తెలిపారు. 2022-23లో 16.12 లక్షల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం వచ్చినంత రాబడి అప్పుడు రాలేదు.దానికి కారణం భూముల ధరలు తక్కువగా ఉండటం. ప్రస్తుతం భూముల ధరలు భారీగా పెరగడంతోపాటు హైదరాబాద్ శివారు, చుట్టు పక్కల జిల్లాల్లో ఖరీదైన భూముల రిజిస్ట్రేషన్లు అధికమవడమే ఆదాయం పెరగటానికి కారణమని రిజిస్ట్రేషన్ల వర్గాలు చెబుతున్నాయి. నివాస గృహాలు, విల్లాలు, ఫ్లాట్ల



రిజిస్ట్రేషన్లతోపాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఇటీవల జరిగిన ఖరీదైన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల కారణంగా రాబడి గతం కంటే పెరిగి ఉండొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లోనూ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి ఆధునిక మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలతో కూడిన అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను నిర్మిస్తుంది. కొత్త సమీకృత రిజిస్ట్రేషన్ ఆఫీసు భవనాల్లో భూముల రిజిస్ట్రేషన్‌తో పాటుగా.. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజ్ హాల్స్, గర్భిణులు, పిల్లలు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి.

# కోర్టు తీర్పు రాకముందే 'ఇల్లీగల్' అని ఎలా డిసైడ్ చేస్తారు ?

## సిట్ చీఫ్ సజ్జనార్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం

**హైదరాబాద్ :**రాజ్యాంగం ప్రకారం పోలీసుల పని కేవలం ఎంక్వయిరీ చేయడం మాత్రమే.. తీర్పులు ఇవ్వడానికి మీరేమీ న్యాయమూర్తులా అని మాజీ మంత్రి హరీష్ రావు సిట్ కు సారథ్యం వహిస్తున్న హైదరాబాద్ సీపీ సజ్జనార్ ను నిలదీసారు.విచారణ ఇంకా నడుస్తుండగానే ఇల్లీగల్ అని ఫిక్స్ అయ్యారంటే.. మీరు ముందే ఒక నిర్ణయానికి వచ్చారా? ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వకపోవడమేనా మీ సంస్కారం? ఖాకీ డ్రెస్ వేసుకొని రాజకీయ అజెండాలు అమలు చేయడం ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్కు విరుద్ధమని మీకు తెలియదా అని ప్రశ్నించారు.తీర్పులు చెప్పాల్సింది కోర్టులు.. పోలీసులు కాదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కోర్టు విచారణ జరిపి తుది తీర్పు ఇవ్వకముందే, సిట్ చీఫ్ సజ్జనార్ గారు అధికారికంగా 'ఇల్లీగల్' అని ప్రకటించడం బాధ్యతరాహిత్యం.మన ప్రజాస్వామ్యంలో కోర్టు నిర్ధారించే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా చూడకూడదనేది కనీస న్యాయ సూత్రం. ఈ న్యాయ సూత్రాన్ని పాటించకపోవడం శోచనీయం. దీనిని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ప్రాథమిక హక్కుల్లో స్పష్టం చేస్తుంది.పోలీసుల పని కేవలం దర్యాప్తు చేయడం మాత్రమే. విచారణ దశలోనే ఒక అంశాన్ని చట్టవిరుద్ధమని ప్రకటించడానికి మీరేమైనా న్యాయమూర్తులా.అసలు ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం 5(2), ఐటీ చట్టం, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం జరిగిందా లేదా అన్నదానిపై



ఆధారపడి ఉంటుందని మీకు తెలియదా అని అన్నారు.ఇందులో ఏదైనా ఉల్లంఘన జరిగితే అది కోర్టు విచారణ ద్వారానే తేలాలి తప్ప, పోలీసుల అధికారిక ప్రకటనల ద్వారా కాదు. సజ్జనార్ గారు విడుదల చేసిన అధికారిక ప్రకటన (ట్విట్టర్లో) లో ఇల్లీగల్ ఫోన్ ట్యాపింగ్ అనే పదాన్ని వాడటం చూస్తుంటే, దర్యాప్తు ఫలితంపై మీరు ముందే ఒక నిర్ణయానికి వచ్చారని అర్థమవుతోంది. సీనియర్ అధికారుల నుండి ఆశించే నిష్పాక్షికతకు, ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ 1968 ప్రకారము ఇది తప్పు అని మీకు తెలియదా. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడికి సంబంధించిన అంశంలో.. ఇలాంటి తొందరపాటు ప్రకటనలు చూస్తుంటే ఇది పక్షపాతంతో కూడిన రాజకీయ ప్రేరేపిత దర్యాప్తు అని స్పష్టం అవుతున్నదని అన్నారు.దర్యాప్తు అనేది నిష్పాక్షికంగా ఉండటమే కాదు, ఉన్నట్లు కనిపించాలని కూడా సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పింది. సిట్ చీఫ్ విచారణకు ముందే దోషులు ఎవరో నిర్ణయిస్తే చట్టాలు ఎందుకు, కోర్టులో ఎందుకు. సిట్ చీఫ్ మీరు విడుదల చేసిన అధికారిక ట్విట్టర్ ప్రకటనలో కనీసం కేసీఆర్ ని గౌరవ ప్రతిపక్ష నాయకులు అని సంబోధించడానికి కూడా ఇష్టపడకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? ఒక మాజీ ముఖ్యమంత్రికి, ప్రస్తుత ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన కనీస గౌరవం ఇవ్వకపోవడం ద్వారా మీరు ఏం చెప్పదలుచుకున్నారని అన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం...

- మొదటి పేజీ తరువాయి

హబ్‌గా గుర్తింపు పొందిందని, కరోనా సమయంలో భారత్ బయోటెక్ ప్రపంచానికే వ్యాక్సిన్లు అందించిందని గుర్తుచేశారు. అయినా ఫార్మా హబ్ కార్యక్రమాల్లో తెలంగాణకు చోటు దక్కకపోవడం దారుణమన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగానికి బడ్జెట్‌లో రూ.40,000 కోట్లు కేటాయించినా, ఇప్పటికే అభివృద్ధి చెందిన హైదరాబాద్‌కు



ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఆడియో-వీడియో, గేమింగ్, కామిక్స్‌కు కేంద్రమైన హైదరాబాద్‌ను కాదని, 'ఆరెంజ్ ఎకానమీ' కార్యకలాపాలను ముంబైకి తరలించడం అన్యాయమని అన్నారు.అంతేకాకుండా, టూరిజం, మెడికల్ హబ్, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి రంగాల్లోనూ తెలంగాణను విస్మరించారని ఆరోపించారు. సెమీకండక్టర్ యూనిట్ కోసం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రధానిని కోరినా, ఆ ప్రాజెక్టులను ఇతర రాష్ట్రాలకు కేటాయించి తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిందని భట్టి విమర్శించారు.తమకు 4 శాతం ఆర్థిక లోటుకు అనుమతివ్వాలని కోరితే నిరాకరించిన కేంద్రం, తనకు తానుగా 4.3 శాతం ఆర్థిక లోటు నిర్దేశించుకుందని దుయ్యబట్టారు. తెలంగాణ ఈ దేశంలో అంతర్భాగం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ఎంపీలందరూ పార్టీలకు అతీతంగా ఏకమై, నిధుల కేటాయింపు కోసం ప్రధాని, ఆర్థిక మంత్రిపై ఒత్తిడి తేవాలని భట్టి విజ్ఞప్తి చేశారు.ల

# వెనిజులాతో ఆయిల్ ఒప్పందం

- మొదటి పేజీ తరువాయి

భారత్ పాత్రపై అనూహ్య వ్యాఖ్యలు చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, భారత్ ఆ చమురు దిగుమతులు పెంచనుందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ స్పందించలేదు.వెనెజువెలాలోని భారీగా ఉన్న చమురు నిల్వల కోసమే ట్రంప్ సైలెంట్ ఆపరేషన్ నిర్వహించి అధ్యక్షుడు నికోలస్



మదురో, ఆయన భార్యను ఎత్తుకొచ్చారు. ప్రస్తుతం ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ మాత్రం 'ఆమె నా కోరికల ప్రకారం పాలిస్తోంది. చమురు మొత్తం మాకు చేరే వరకు కొనసాగుతారు' అని ట్రంప్ స్పష్టం చేశారు. 'మేము వెనెజువెలాతో ఒప్పందం కుదుర్చుకున్నాం. భారత్ కూడా చేరనుంది' అని ట్రంప్ తెలిపారు. చైనా కూడా చర్చల్లో ఉందని, దాన్ని స్వాగతిస్తామని చెప్పారు. వెనెజువెలా చమురు నిల్వలు పూర్తిగా అమెరికా నియంత్రణలో ఉన్నాయని స్పష్టం చేశారు.ఇదిలా ఉంటే.. ఇటీవల భారత ప్రధాని మోదీ, రోడ్రిగ్జ్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులపై ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తన ఆధిపత్యం చాటుకునేందుకు భారత్‌ను బద్నాం చేస్తున్నట్లు తెలుస్తోంది.వెనెజువెలా చమురు కొనుగోలుతో భారత్‌కు చమురు దిగుమతులు సులభమవుతాయి. కానీ అమెరికాకు తొలొగ్గాల్సి ఉంటుంది. చైనా పాల్గొంటే గ్లోబల్ ఎనర్జీ డైనమిక్స్ మారవచ్చు. ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ అధికారికంగా స్పందించలేదు.

# సౌత్ కు బూస్టప్... కారిడార్లు...

- మొదటి పేజీ తరువాయి

నడుస్తున్న వందేభారత్ సీటింగ్ ట్రైన్ల గరిష్ఠ వేగం 150 కి.మీ. కాగా.. త్వరలో ప్రవేశపెట్టనున్న స్లీపర్ ట్రైన్‌కు ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ ట్రైన్ల గరిష్ఠ వేగం 180 కి.మీ. వేగం అందుకుంది. తాజాగా హైస్పీడ్ కారిడార్ ట్రైన్ ప్రాజెక్టులను 350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా డిజైన్ చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణె నగరాలకు ఎక్స్‌ప్రెస్




ట్రైన్లలో చేరుకునేందుకు 12-15 గంటల సమయం పడుతుండగా.. హైస్పీడ్ కారిడార్ కార్యరూపం దాలిస్తే 3 నుంచి 3.5 గంటల్లోనే ఆయా నగరాలకు చేరుకోవచ్చు.హైస్పీడ్ కారిడార్‌లో హైదరాబాద్ నుంచి ఖమ్మం, కర్నూలు వంటి నగరాలకు గంట సమయంలోనే చేరుకోవచ్చు. ఏపీ రాజధాని అమరావతికి సుమారు 75 నిమిషాలు, అనంతపురం పట్టణానికి 90 నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా.. చిన్న నగరాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లోనూ స్టాపేజీలను గుర్తించారు. తెలంగాణలో నార్కట్‌పల్లి, వనపర్తి రోడ్డు, శంషాబాద్ వంటి పట్టణాలతో పాటుగా.. సూర్యాపేట, మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి జిల్లా కేంద్రాల్లోనూ ఈ ట్రైన్లు ఆగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల, కావలి, గూడూరు వంటి పట్టణాల్లోనూ ఈ ట్రైన్లకు అనుగుణంగా స్టేషన్లు నిర్మించనున్నారు. ప్రస్తుత రైల్వేలైన్లతో సంబంధం లేకుండా కేవలం వీటి కోసమే కొత్తగా ట్రైన్ లైన్లు నిర్మిస్తారు.కీలకదశలో తుది ఎలైన్‌మెంట్ హైదరాబాద్-పుణె హైస్పీడ్ కారిడార్ జహీరాబాద్, కలబురిగి, శోలాపుర్, పంధార్‌పుర్, అక్లుజ్, దౌడ్, పుణె, స్టేషన్లలో ప్రతిపాదించారు. హైదరాబాద్-చెన్నై ఎలైన్‌మెంట్‌ను శంషాబాద్, నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం నుంచి ఏపీలో అమరావతి మీదుగా ప్రతిపాదించింది.హైదరాబాద్-బెంగళూరు మార్గంలో శంషాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్ మీదుగా రైల్వేశాఖ ప్రతిపాదించింది.తాజా ప్రాజెక్టులతో హైదరాబాద్‌కు చెన్నై, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాలతోపాటు.. పుణె,ఖమ్మం, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, అమరావతి, కర్నూలు, కలబురిగి, శోలాపుర్ వంటి నగరాలకు వేగవంతమైన ట్రైన్ కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. అయితే భూసేకరణ చిక్కులు, రూ.లక్షల కోట్ల వ్యయం వంటి అంశాల నేపథ్యంలో ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు చాలా ఏళ్లు పట్టే అవకాశాలున్నాయి.

# భారీగా తగ్గిన స్పామ్ కాల్స్

**ముంబై, ఫిబ్రవరి 2:**సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' పోర్టల్, యాప్ అద్భుత ఫలితాలను ఇస్తోంది. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న సుమారు 1.52 కోట్ల మొబైల్ నంబర్లను బ్లాక్ చేసినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. వినియోగదారుల భద్రతే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంచార్ సాథీ యాప్ పనితీరును వివరిస్తూ.. గతంలో విదేశాల నుండి వచ్చే నకిలీ కాల్స్ సంఖ్య 1.35 కోట్లుగా ఉండేదని, ఇప్పుడు అవి 95 శాతం మేర తగ్గాయని మంత్రి తెలిపారు. అంతే కాకుండా మోసపూరిత సిమ్ కార్డులతో లింక్ అయిన దాదాపు 27 లక్షల వాట్సాప్ ఖాతాలను కూడా నిలిపివేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 2 కోట్ల మందికి పైగా వినియోగదారులు సంచార్ సాథీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.ఈ యాప్ ద్వారా ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత వివరాలపై నిఘా పెడుతుందన్న ఆరోపణలను మంత్రి ఖండించారు. ఇందులో ఎలాంటి నిఘా ఉండదని, కేవలం సైబర్ మోసాలను అడ్డుకోవడానికే దీన్ని రూపొందించామని స్పష్టం చేశారు.

# నల్లగొండలో ఏఐఎంఐఎం భారీ బహిరంగ సభ ..

## సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు



ఢిల్లీ, ఫిబ్రవరి 2 : సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలుపై రాష్ట్ర హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీం న్యాయస్థానం డిస్మిస్ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలు పోస్టులు పెట్టారని పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ కేసుపై గతంలో విచారణ చేపట్టిన రాష్ట్ర హైకోర్టు.. సదరు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై మెకానికల్‌గా కేసులు నమోదు చేయొద్దని పోలీసులకు సూచించింది. ఈ మార్గదర్శకాలు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా గతంలో ప్రస్తావించారు. ఈ కేసును తాజాగా విచారించిన సుప్రీం న్యాయస్థానం.. హైకోర్టు తీర్పును అభినందిస్తున్నామని, మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమీలేదని స్పష్టం చేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. దోషులను జైలుకు పంపాలి

**: ఎంపీ రఘునందన్ రావు**



సిద్దిపేట జిల్లా, ఫిబ్రవరి 2 : ఫోన్ ట్యాపింగ్ కేసుపై బీజేపీ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సిట్ విచారణ త్వరలోనే పూర్తి కావాలని, దోషులను జైలుకు పంపాలని కోరారు. తప్పు చేసినవారు కొడుకైనా, కూతురైనా జైలుకు పంపుతానని.. 2014 జూన్‌లో మాజీ సీఎం కేసీఆర్ శాసనసభలో మాట్లాడారని ప్రస్తావించారు రఘునందన్. ఆ మాటలు.. కేసీఆర్‌కు కూడా వర్తిస్తాయని స్పష్టం చేశారు. సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారంలో రఘునందన్ రావు పాల్గొని ప్రసంగించారు.

**గజ్వేల్ అభివృద్ధిలో కాంగ్రెస్ సర్కార్ పాత్ర లేదు..**

గజ్వేల్ అభివృద్ధిలో కాంగ్రెస్ సర్కార్ పాత్ర ఏమీ లేదని బీజేపీ ఎంపీ విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ తాను పోటీచేసిన గజ్వేల్‌కు 'గడ' అని పేరు పెట్టారని.. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు 'కుడ' అని పేరుపెట్టారు తప్ప.. ఆ నియోజకవర్గాల ఆర్థిక స్థితిగతుల్లో ఎలాంటి మార్పులూ లేవని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్ అభివృద్ధికి నోచుకోలేదని, రెండేళ్లుగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు.

**హైదరాబాద్‌కు మూడు హై స్పీడ్ రైళ్లు..**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను విమర్శించే మూర్ఖులంతా అంధులేనని ఎంపీ రఘునందన్ విమర్శించారు. 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని ఒక్కొకరు ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి ఒక్కొక్కరు ఒక తీరుగా వ్యాఖ్యానిస్తున్నారు. బడ్జెట్‌పై ఒక దిక్కు కేటీఆర్.. ఇంకో దిక్కు హరీశ్‌రావు, కవిత మాట్లాడుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో దక్షిణ భారతదేశానికి 7 హైస్పీడ్ రైళ్లు కేటాయిస్తే అందులో హైదరాబాద్‌కు మూడు హైస్పీడ్ రైళ్లు కేటాయించడం జరిగింది. ఈ విషయం.. బావబామ్మర్దులకు కనిపించడం లేదా? గత బడ్జెట్ కంటే రైల్వే రంగానికి ఈసారి 15 శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని చెబుతున్నరాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఓసారి బడ్జెట్‌ను పరిశీలించాలి. గతంలో కంటే ఈసారి రూ.1300 కోట్లు రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేటాయించారు' అని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## ప్రజాభీష్టం మేరకు నిజాయితీగా ప్రజా సేవ చేస్తున్నా...

**- అభివృద్ధిని చూసి ఓటేయండి**

**పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు**



**పెద్దపల్లి:** ప్రజాభీష్టం మేరకు నిజాయితీ గా ప్రజా సేవ చేస్తున్నానని అభివృద్ధిని చూసి ఓటేయా లని పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు అన్నా రు. పెద్దపల్లి మున్సిపల్ పరిధి లోని 36 వార్డులకు గాను 33 వార్డులకు చెందిన కాంగ్రెస్ అ భ్యర్థులను ఎమ్మెల్యే విజయ రమణ రావు ప్రకటించారు. అనంతరం రంగంపల్లి 10వ వార్డు మాజీ కౌన్సిలర్ గాదె మాధవి కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే విజయరమ ణ రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల వివరాలు పూరేళ్ళ శైలజ (1 వార్డు), లక్ష్మి పస్తం (2 వార్డు), మొలగూరి కమల్ (3 వార్డు), కొమ్ము సుధాకర్ (4 వార్డు), గుజ్జుల కుమార స్వామి (5 వార్డు), కట్ట పద్మా వతి (6 వార్డు), ఈర్ల స్వరూప (7 వార్డు), ఎరుకల కల్పన (8 వార్డు), అక్కెపల్లి సుజాత (10 వార్డు), అనూష పూదరి (11 వార్డు), దొడ్డుపల్లి జగదీష్ (12 వార్డు), పాగల శ్రీకాంత్ (13 వార్డు), మహమ్మద్ అస్లాశీ పర్వేజ్ (14 వార్డు), నేతెట్ల కొమురయ్య (15 వార్డు), నాంసాని శ్రీనివాస్ (16 వార్డు), తోట ఫణీందర్ (17 వార్డు), భూతగడ్డ సంపత్ (18 వార్డు), నల్లాల పద్మ (19 వార్డు), బండి రమ్యకృష్ణ (20) వార్డు), నూగిళ్ళ మల్లయ్య (21వార్డు),ఉప్పు స్వరూప (22 వార్డు), తాడూరి శ్రీమన్నారాయణ (23 వార్డు), కొట్టే స్వరూప (24 వార్డు), సూది మల్ల అమ్రేష్ (26 వార్డు), ఉను కొండ సరస్వతి (27 వార్డు), తూముల లత (28 వార్డు), ఇల్లందుల రజని (29 వార్డు), సాజిదాబాను (30 వార్డు), మంథని నర్సింగ్ (31 వార్డు), తిర్రీ శ్రీలత (32 వార్డు) బూతగడ్డ స్వప్న (33 వార్డు), దేవనంది రమాదేవి (35 వార్డు), ముస్కాన్ నాజ్ నయ్యర్ (36 వార్డు) ప్రకటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్ల పాలనలో రూ.40 కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాలువలు, మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో పాత వాటర్ ట్యాంక్ స్థానంలో కొత్తగా వాటర్ ట్యాంక్, చందపల్లి డబుల్ బెడ్ రూం ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్నామ ని తెలిపారు. రూ 62.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, మరో 15 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. వీ టిని ప్రజల అవసరాలను గుర్తించి నిధులు కేటాయిస్తాన ని పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి రూ 77.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఇం టిగ్రేటెడ్ మార్కెట్ ఆధునీకర ణ కోసం రూ 7.5 కోట్లు కేటాయించినట్లు వివరించా రు.

**వేలాదిగా తరలివచ్చిన ప్రజలు**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఏఐఎంఐఎం జాతీయ అధ్యక్షులు, లోక్‌సభ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ నల్లగొండకు విచ్చేశారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో పాదయాత్ర నిర్వహించి ప్రజలను నేరుగా కలుసుకుని తమ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపు కోసం ఓట్లు అభ్యర్థించారు. అనంతరం నల్లగొండ పట్టణంలోని భాస్కర్ టాకీస్ చౌరస్తా వద్ద ఏఐఎంఐఎం జిల్లా అధ్యక్షులు రజియోద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఓవైసీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సభకు వేలాదిగా ప్రజలు హాజరై మజ్లిస్‌కు తమ మద్దతు ప్రకటించారు.

**నల్లగొండలో తీవ్రమైన సమస్యలు**

ఓవైసీ మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో అనేక సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఓల్డ్ సిటీతో పాటు పలు డివిజన్లలో తాగునీటి కొరత, చెత్త నిర్వహణ లోపాలు, రోడ్ల దుస్థితి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. ఈ సమస్యలన్నిటికి పరిష్కారం ఏఐఎంఐఎం బలపడటమేనని, ప్రజలు తమ ఓటుతో పతంగి గుర్తుకు మద్దతు ఇచ్చి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

**ఏఐఎంఐఎం అభ్యర్థుల వివరాలు**

ఈ ఎన్నికల్లో ఏఐఎంఐఎం తరఫున

22వ వార్డు -- మహమ్మద్ అలీ,
24వ వార్డు -- మహమ్మద్ నసీర్,
26వ వార్డు -- మజ్హర్ ఉల్ హక్,
27వ వార్డు -- అథర్ సుమైర్,
29వ వార్డు -- ఖాజా సామియుద్దీన్ (నదీమ్),
31వ వార్డు -- హుమైరా ఫర్హాజ్,
45వ వార్డు -- మహమ్మద్ రాజియుద్దీన్ (హాజీ),
46వ వార్డు -- రఫీయుద్దీన్ హాజీ

పోటీలో ఉన్నారని తెలిపారు. అలాగే భువనగిరిలో ఇద్దరు, మిర్యాలగూడలో ఒక





అభ్యర్థి మజ్లిస్ తరఫున పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు.నల్లగొండ అభివృద్ధికి మజ్లిస్ అవసరం నల్లగొండలో మజ్లిస్ రాజకీయంగా బలపడితేనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఓవైసీ అన్నారు. ఓల్డ్ సిటీలో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తాగునీరు, రోడ్లు, చెత్త సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని విమర్శించారు. మజ్లిస్‌కు అవకాశం ఇస్తే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బాలికల రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణంలో జరిగిన జాప్యానికి స్థానిక నాయకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.

**వక్ఫ్ భూముల పరిరక్షణలో మజ్లిస్**

హజరత్ సయ్యద్ లతీఫ్ షావుల్లా ఖాద్రి దర్గా భూముల ఆక్రమణ ప్రయత్నాలను మజ్లిస్ అడ్డుకుందని, వక్ఫ్ భూముల పరిరక్షణకు తమ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఓవైసీ స్పష్టం చేశారు.ఓటుతోనే నాయకత్వం ముస్లింలు, దళితులు, వెనుకబడిన వర్గాలు తమ ఓటుతోనే తమ నాయకత్వాన్ని నిర్మించుకోవాలని ఓవైసీ పిలుపునిచ్చారు. ఏఐఎంఐఎం ప్రతినిధులు మాత్రమే ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రశ్నిస్తారని అన్నారు. ఇది కేవలం మున్సిపల్ ఎన్నిక కాదు, ప్రజల రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నిక అని స్పష్టం చేశారు.

**కేంద్రంపై విమర్శలు**

గోరక్ష పేరుతో జరుగుతున్న హింసపై తీవ్రంగా స్పందించిన ఓవైసీ, దేశంలోని పలు రాష్ట్రాల్లో అమాయకులపై జరుగుతున్న దాడులను ఖండించారు. అలాగే చైనా--పాకిస్థాన్ అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ స్పష్టమైన విదేశాంగ విధానం అవసరమని సూచించారు. ఈ నెల 11వ తేదీన పతంగి గుర్తుపై ఓటు వేసి ఏఐఎంఐఎం అభ్యర్థులను గెలిపించాలని నల్లగొండ ప్రజలకు ఓవైసీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, సీనియర్ నాయకులు, జిల్లా, పట్టణ నాయకులు, కార్పొరేటర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## 18వ డివిజన్‌లో కీలక పరిణామం

**ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజుకు చిగుర్ల లలిత సురేష్ మద్దతు**





18వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చిగుర్ల లలిత సురేష్, తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు దంపతులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి మద్దతు ప్రకటించిన చిగుర్ల లలిత సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మద్దతు తమకు మరింత బలం, ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. అదే విధంగా చిగుర్ల లలిత సురేష్ మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధి కోసం నిజాయితీగా పనిచేసే నాయకత్వానికి ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో సింహం గుర్తుపై ఓటు వేసి ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాలనీ వాసులను ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామంతో 18వ డివిజన్‌లో ఎన్నికల పోరు మరింత ఉత్కంఠభరితంగా మారింది. ప్రజల మద్దతు పెరుగుతుండటంతో ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు విజయం దిశగా అడుగులు వేస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## 10వ వార్డులో ప్రచారానికి శ్రీకారం..

**పిల్లి కృష్ణం రాజుకు ప్రజల విస్తృత మద్దతు**



10వ వార్డు నుంచి పిల్లి కృష్ణం రాజు తన ఎన్నికల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రచార ఆరంభానికి స్థానిక ప్రజల నుంచి విస్తృత మద్దతు లభించింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ప్రచారానికి ఊపునిచ్చారు. ప్రచారంలో భాగంగా పిల్లి కృష్ణం రాజు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రచారం ప్రారంభంతో 10వ వార్డులో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

## నల్లగొండలో హైటెన్షన్.. మైసయ్య బొమ్మ సెంటర్ వద్ద ఉద్రిక్తత



నల్లగొండ పట్టణంలోని మైసయ్య బొమ్మ సెంటర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిను అరెస్ట్ చేసేందుకు జిల్లా పోలీసులు ప్రయత్నించడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. పోలీసుల చర్యకు నిరసనగా అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కంచర్ల భూపాల్ రెడ్డి సొమ్మసిల్లి కింద పడిపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే మైసయ్య సెంటర్ పరిసరాల్లో భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. అరెస్ట్ ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డుపైకి వచ్చారు. నినాదాలు, ఆందోళనలతో ఆ ప్రాంతమంతా హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ ఘటన కారణంగా మైసయ్య బొమ్మ సెంటర్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు.ప్రస్తుతం పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## 18వ డివిజన్ కార్పొరేటర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు ప్రచారం ప్రారంభం



18వ డివిజన్ నుంచి కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థిగా ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు తన ఎన్నికల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రచార ప్రారంభ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు. ప్రజల సమస్యలను వినడం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేయడం వంటి హామీలను ఆమె ప్రజలకు ఇచ్చారు. ప్రచారం ప్రారంభమైతో 18వ డివిజన్‌లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

Printed, Published & Owned by **KANDI SURYA NARAYANA,** Printed at Parthasarathi Offset Printers, Prakasham Bazar, Nalgoda - 508 001, T.G
Editor : **KANDI SURYA NARAYANA,** D.No. 5-6-109/B1, Bottuguda Nalgonda-508 001, T.G. Cell : 98480 52327, , **Email : cheekativelunewsdaily@gmail.com**